

షోకాజ్ నోటీసుకు సమాధానం చెప్పాలి : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

మేయర్ సురేష్‌బాబుకు ప్రభుత్వం షోకాజు నోటీసుకు పంపిందని, దీనికి సమాధానం చెప్పాలని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారు బాధ్యతాయుతమైన పదవుల్లో కొనసాగడానికి వీలులేదని, త్వరలో మేయర్ మాజీ మేయర్ కాబోతున్నాడని పేర్కొన్నారు. దీనిని జీర్ణించుకోలేక ఎమ్మెల్యే పైనా, తనపైనా అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. తాను ఎక్కడైన కబ్జాకు పాల్పడినట్లు నిరూపిస్తే దానిని ప్రభుత్వానికే రాసిస్తానని సవాల్ విసిరారు. ఎపిలో ఎక్కాడా తమకు కాంట్రాక్ట్ పనులు లేవని చెప్పారు. సమావేశంలో కార్పొరేటర్ సుబ్బారెడ్డి, నాయకులు జిలానీ బాష పాల్గొన్నారు.

పోలీసు శాఖ ప్రతిష్ట పెంచేలా విధులు

- గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కఠిన చర్యలు
- క్రికెట్ బెట్టింగ్, మట్కా, గ్యాంబ్లింగ్‌పై నిఘా
- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి
- నేర సమీక్షా సమావేశంలో ఎస్‌పి ఇ.జి.అశోక్ కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

పోలీస్ శాఖ ప్రతిష్ట మరింత పెంపొందించేలా విధులు నిర్వర్తించాలని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను గంజాయి, ఇతర నిషేదిత మత్తు పదార్థాల రహితంగా చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు ముమ్మరం చేయాలని పేర్కొన్నారు. గంజాయి సేవించే అవకాశం ఉన్న శివారు ప్రాంతాలు, ఇతర ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మిస్సింగ్ కేసులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, త్వరితగతిన ఆచూకీ కనుగొని వారి కుటుంబ సభ్యుల కు అప్పగించాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న కేసులపై నిశితంగా సమీక్ష జరిపి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలైన క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని, అలాగే బెట్టింగ్ యాప్స్ పై చర్యలు తీసుకోవాలని ఎస్.పి తెలిపారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల ఆదేశాలను క్షేత్రస్థాయి సిబ్బందికి తెలియచేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని, గతంలో ప్రమాదాలు జరిగిన బ్లాక్ స్పాట్స్, హాట్ స్పాట్స్ ను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సి.సి కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మలుపుల వద్ద అతి వేగం, వేగ నియంత్రణ లేకపోవడం వల్ల అధికంగా ప్రమా దాలు జరిగే అవకాశం ఉందన్నారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వ యం చేసుకుని తగిన చర్యలు చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ధాబాలు, హోటళ్ళు, లాడ్జిలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్ లలో తనిఖీలు నిర్వహించాలన్నారు. పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని, విద్యాసంస్థల వద్ద ఈవ్ టీజింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా పగలు, రాత్రి గస్తీని పెంచాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లాలోని డిఎస్‌పి లు, సిఐలు పాల్గొన్నారు. విధుల్లో ప్రతిభ కనబరచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.



మాట్లాడుతున్న ఎస్‌పి అశోక్ కుమార్

బాలికపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు

దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు, బంధువులు

ప్రజాశక్తి - బద్వేలు

4వ తరగతి చదువుతున్న బాలికపై కీచక ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, బంధువులు అతినికి దేహశుద్ధి చేశారు. వివరాలు.. శనివారం పట్టణంలోని శివానగర్‌లో లిటిల్ ఫ్లవర్స్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న 10 సంవత్సరాల బాలికను అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు అన్వర్ ఎవరూ లేని సమయంలో లోనికి పిలిచి అసభ్యంగా, లైంగికంగా వేధించాడు. ఈవిషయం బాలిక తమ తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఆగ్రహంతో పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. సంఘటన గల కారణాలను విచారించి కోర్టు ద్వారా శిక్ష పడేలా చేస్తామని తెలిపారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే ఇంతటి ఘాతుకానికి పాల్పడ్డం చాలా దారుణమని, ఆడపిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారికి కఠిన శిక్షలు లేకపోవడం వల్లే ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని శివానగర్ వాసులు వాపోయారు.

కీచక ఉపాధ్యాయుడు పై కఠిన చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

బద్వేలు పట్టణం, శివానగర్‌లో ఉన్న లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నాలుగో తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థినిపై సదరు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న అన్వర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని పేర్కొన్నారు. శనివారం గోపవరం మండల విద్యాశాఖ అధికారి చెన్నయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ లాంటి ఘటనల వల్ల విద్యార్థినుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపాలంటే భయభ్రాంతులకు గురవుతారని, మానవ మృగంలా విద్యార్థిని పై అసభ్యంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని, ప్రయివేట్ విద్యాసంస్థలు ఉపాధ్యాయులను నియమించుకునేటప్పుడు వారి చదువులకు సంబంధించిన అర్హతతో పాటు వారి వ్యక్తిగత జీవన అలవాట్లను, ప్రవర్తను గమించాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేలు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ ఆదిల్, బద్వేలు రూరల్ అధ్యక్ష కార్యదర్శులు ముడమాల ఓబులు రెడ్డి, ఉప్పులూరు బాల గురయ్య, పట్టణ నాయకులు యువరాజు, సుధాకర్, నరసింహ పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలి

ప్రజాశక్తి - కడప : స్మార్ట్ మీటర్ల వ్యవస్థాపనను తక్షణమే ఆపాలని డిసిసి అధ్యక్షులు ఎన్.డి విజయ జ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల స్థాయిలో సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు న్యాయమైన వేతనం, ఇతర హక్కులు అందించాలని అన్నారు. ప్రజలపై ఆర్థిక భారం పెంచే స్మార్ట్ మీటర్ల వ్యవస్థాపనను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ స్కూల్ మేనేజ్‌మెంట్ బాధ్యతారాహిత్యంతో పదవ తరగతి ప్రశ్నపత్రాలు లీక్ అవుతున్నాయి. సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దళిత కాలనీల అభివృద్ధి మరిచిన ప్రభుత్వం

ప్రజాశక్తి - బద్వేలు

పట్టణంలోని దళిత కాలనీయల అభివృద్ధిని పాల వర్గాలు మరిచాయని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. శనివారం సిపిఎం పట్టణ కమిటి ఆధ్వర్యంలో రూపరాంపేట, మొండివాడ, శ్రీ జాంబవంత నగర్‌లలో సిపిఎం ప్రజాయాత్ర నిర్వహించారు. సిపిఎం నాయకత్వానికి అక్కడి ప్రజలు అనేక సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ముడియం చిన్ని మాట్లాడుతూ మున్సిపాలిటీ రెండవ వార్డు రూపరాంపేట, మొండివాడ, జాంబవంత నగర్‌లలో నివసిస్తున్న వారిలో అత్యధికులు దళిత సామాజిక వర్గానికి చెందిన వారని, మొండివాడలో నివసిస్తున్న వారు బిసి సామాజిక వర్గానికి చెందినవారని చెప్పారు. వీరంతా కూలి నాలి చేసుకొని జీవనం సాగించే నిరుపేదలని తెలిపారు. అనేక సంవత్సరాలుగా స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని నివాసాలు ఉన్నప్పటికీ మొండివాడ ప్రజలకు నేటికీ ఉన్నచోట పక్కా గృహం నిర్మించుకోవడానికి రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వలేదని వాపోయారు. సదరు కాలనీలలో మురుగు కాలువలలో నీరు ప్రవహించక చెత్త పేరుకొని దుర్వాసన వెదజల్లుతూ దోమల ఉత్పత్తి కేంద్రాలుగా కాలువలు ఉన్నాయని చెప్పారు. కాలువలలో మురుగు నీటిని సైతం తొలగించడం లేదని, దోమల నియంత్రణకు ఎటువంటి క్రిమిసంహారక మందులను కూడా చల్లడం లేదని పేర్కొన్నారు. రూపరాంపేట వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద గల మురుగు నీరు దిగువకు ప్రవహించక అక్కడే నిలువ ఉండడం వల్ల నిత్యం జనావాసాలకు ఇబ్బంది కలుగుతుందని చెప్పారు. శ్రీ జాంబవంత నగర్ సంబంధించిన శ్మశాన వాటిక సైతం కబ్జాలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు సిపిఎం యాత్ర బృందానికి విన్నవించారని చెప్పారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పాలకులు స్పందించి దళిత కాలనీలలో పర్యటించి ఇక్కడ ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం బద్వేలు పట్టణ కమిటీ సభ్యులు పసుపుల మోక్షమ్మ, షేక్ మస్తాన్ షరీఫ్, సగిలి రాయప్ప, శాఖ కార్యదర్శులు ఊటుకూరు బాలమ్మ, మూరా ప్రసాద్, షేక్ మస్తాన్ బీ, షేక్ ఆదిల్, నాయకులు బాల గురయ్య, సుధాకర్, రామకృష్ణ, యువరాజు, రాజారాం పాల్గొన్నారు.



కాలనీ వాసుల సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

కుర్చీ కోసమే..కక్షసాధింపు : మేయర్

- షోకాజ్ నోటీసుకు సమాధానం ఇస్తా

ప్రజాశక్తి - కడప అర్బన్

తన పైన కుట్ర పూరితమైన ఆరోపణలను ఎమ్మెల్యే మాధవి చేయడం హాస్యాస్పదంగా ఉందని మేయర్ సురేష్ బాబు పేర్కొన్నారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ సమావేశ మందిరంలో మేయర్ కుర్చిపక్కన ఎమ్మెల్యేకు కుర్చిచేయలేదన్న అక్కస్సుతో రాజకీయకక్ష సాధింపునకు పాల్పడుతున్నారని విమర్శించారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడు చిన్న మచ్చ కూడా లేకుండా నీతి, నిజాయితీగా నడుచుకుంటూ ఉన్నామని తెలిపారు. అవినీతికి ఆజ్యం పోసే టిడిపి నేతలు తన పైన ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. 2015, 2016, 2017 సంవత్సరాలలో నీరు చెట్టు కింద అర్బన్ ఏరియాలో రూ. 70 లక్షల పనులను నిర్వహించింది టిడిపి కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇరిగేషన్ శాఖ ద్వారా దాదాపు రూ. 80 లక్షల వర్కులకు బిల్లులను చేసుకునే సంస్కృతి టిడిపికే ఉందని తెలిపారు. తన కుమారుడు కాంట్రాక్ట్ చేస్తున్నాడని అధికారులు ఎప్పుడూ తన దృష్టికి తీసుకురాలేదని తెలిపారు. టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి కడప పైలాన్ సర్కిల్‌లో నిర్మించిన ఆర్‌ఎస్‌ఆర్ కాంప్లెక్స్ కోసం 4 సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకున్నారని, కోర్టుకు పోయి స్టే తెచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా పని చేసిన శ్రీనివాసరెడ్డి తండ్రి రాజగోపాల్‌రెడ్డి హయాం నుంచి రాజకీయాలు చేస్తూ ఉన్నారని చెప్పారు.



మాట్లాడుతున్న మేయర్ సురేష్‌బాబు

పేదలకు రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి- కడప సిటీ

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నూర్‌బాష్ దూదేకుల సంఘం ఆధ్వర్యంలో వందలాది పేద కుటుంబాలకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఆయిల్ మిల్ ఓబులేసు మాట్లాడుతూ తన సతీమణి బిబి ఫాతిమా పేరు మీద కడప నగర పరిధిలోని అజాద్ నగర్, భగత్ సింగ్ నగర్ ప్రాంతాలకు చెందిన వందమంది పేదలకు బియ్యం, చక్కెర, సేమి యాలు, గోధుమపిండి, నెయ్యి మొదలగు సరుకులను పంపిణీ చేశామని తెలిపారు. తన వంతు సహాయ కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నూర్ బాష్ దూదేకుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు సుభాన్, ట్రెజరర్ అజ్మతుల్లా, హుస్సేన్ సాహెబ్, ఇసి మెంబర్స్ రహంతుల్లా, అబ్దుల్లా,సాజిద్, భగత్ సింగ్ హజ్రత్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



తోఫా పంపిణీ చేస్తున్న ఓబులేసు

ఉత్కంఠ!

ప్రజాదృష్టి

జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక సాఫీగా సాగినప్పటికీ ఎక్కడో తెలియని ఉత్కంఠ నెలకొంది. వైసిపి జిల్లా నాయకత్వం దూరదృష్టితో వ్యవహరించడం వెరసి అధికార పార్టీ నాయకులు ఎన్నిక బరిలో నిలవని నేపథ్యంలో సాఫీగానే సాగింది. ఖాజీపేట, ప్రొద్దుటూరు మండల పరిధిలోని గోపవరం వైస్ సర్పంచ్ ఎన్నిక, ఖాజీపేట, ఒంటిమిట్ట వైస్ ఎంపిపి ఎన్నికలు ఉత్కంఠ భరిత వాతావరణాన్ని తలపించాయి. కూటమి నాయకులు ఎన్నికల్లో పాల్గొనాల్సిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను రాకుండా ప్రలోభాలకు గురిచేయడం దగ్గర నుంచి అడ్డుకోవడం వరకు వరుసగా చోటుచేసుకున్న దుష్టచేష్టలు ప్రజాస్వామ్య స్ఫూర్తి పతనానికి పరాకాష్ఠకు చేరుకుంది. కూటమి నాయకత్వం ప్రజాస్వామ్య విలువలను, స్ఫూర్తిని కాపాడాల్సిన గురుతరమైన బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంది. లేనిపక్షంలో రాష్ట్రంలో అధికారం ఉందనే దురహంకారంతో అడ్డదిడ్డంగా ముందుకెళ్తే బూమరాంగ్ అవుతుందనే సంగతిని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కడప కార్పొరేషన్ మేయర్ కె.సురేష్ బాబు మున్సిపల్ చట్టాలను ఉల్లంఘించారనే పేరుతో ఉద్దేశపూర్వకంగా వేధింపులకు పాల్పడడం హేయం. ఇదేసమయంలో కడప మేయర్ సైతం తన కుటుంబ సభ్యుల పేరుతో కూడిన కాంట్రాక్టు కంపెనీకి పనులు చేయించడం తగదు. కాంట్రాక్టు పనులు చేసుకోవాల్సి వస్తే మేయర్ పదవిని చేపట్టకూడదు. మేయర్ పదవి చేపట్టిన అనంతరం కుటుంబీకుల పేరిట ఉన్న వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టు సంస్థను కార్పొరేషన్ పరిధిలో ఎటువంటి పనులు చేపట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దీనికి రూ.10 లక్షలలోపు కాంట్రాక్టు పనులు తన పరిధిలోకి రావని, స్టాండింగ్ కమిటీ పరిధిలోని పనులని, కమిషనర్లు కార్పొరేషన్ నిబంధనల్ని పరిశీలించాలని చేస్తున్న వాదన సాంకేతికంగా రక్షణగా నిలబడడం కొంతవరకు సబబే అయినప్పటికీ, వాస్తవానికి తనకు తెలియకుండా చేసిన పనులనే విషయాన్ని జనాంతికంగా తోసిపుచ్చలేని వాస్తవమని గ్రహించాలి. కార్పొరేషన్ మేయర్ మున్సిపల్, కార్పొరేషన్ చట్టాల ప్రకారం ఎమ్మెల్యేను వేదికపై కూర్చోనివ్వలేదనే దుగ్దతో చేపట్టిన ప్రతికార చర్యేననే విషయంలో సందేహాలకు తావు లేదనేది వాస్తవమని గ్రహించాలి. వేదికపై నిబంధనలను ఉల్లంఘించి సీటు ఇవ్వలేదనే ఎమ్మెల్యే వ్యక్తిగత, ప్రతీకార కక్షలతో కార్పొరేషన్ అభివృద్ధిని నిరోధించడం తగదు. ఎత్తుకు పైఎత్తులతో కడప నగర ప్రజల సమస్యలను పక్కదారి పట్టించడం విస్మయాన్ని కలిగిస్తోందనే సంగతిని పాలక, ప్రతిపక్ష పార్టీల నాయకత్వాలు గ్రహించాల్సిన అవసరం ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా రాఘవరెడ్డి

ప్రజాశక్తి - కడప

కడప బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది జి.వి. రాఘవరెడ్డి 83 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది ఏ. ఉమాదేవి 209 ఓట్ల మెజారిటీతో, ప్రధాన కార్యదర్శిగా వి. చంద్రవదన 64 ఓట్ల మెజారిటీతో, కోశాధి కారిగా న్యాయవాది బి. సురేష్ కుమార్ ఒక ఓటు మెజారిటీతో ఘనవిజయం సాధించడం విశేషం. విజయం సాధించిన వారికి చీఫ్ ఎన్నికల అధికారి పెద్దిరెడ్డి జయరామిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. విజయం సాధించిన వారికి సీనియర్, జూనియర్ న్యాయవాదులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పూలమాలలతో ఘనంగా సత్కరించి, స్వీట్లు పంచిపెట్టి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.



రాఘవరెడ్డి, ఉమాదేవి, చంద్రవదన, సురేష్‌కుమార్

ఇన్నోటెక్, కెఎస్‌ఆర్‌ఎం మధ్య ఎంఒయు

ప్రజాశక్తి- కడప అర్బన్ : కెఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల, సరాజ్ ఇన్నోటెక్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్–హైదరాబాద్ మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలపై శిక్షణ అందించడం, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి.ఎస్.ఎస్. మూర్తి మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం ద్వారా తమ విద్యార్థులు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను సంపాదించి, ఉన్నత ఉద్యోగాలు పొందు తారని పేర్కొన్నారు. సరాజ్ ఇన్నోటెక్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శివారెడ్డి మాట్లాడుతూ నేటి టెక్నాలజీ రంగంలో ప్రతిభావంతులైన ఇంజనీర్లను రూపొందించడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి.ఎస్.ఎస్. మూర్తి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్. ఆర్.వి. రమణ, ఇండస్ట్రీస్ డీన్ ప్రొఫెసర్ వి.గిరిధర్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శివారెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా. ఆర్.వి. రమణ, ఇండస్ట్రీస్ డీన్ ప్రొఫెసర్ వి.గిరిధర్, సహా కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిల్పారామంలో పండుగ రోజుల్లో సందడి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగలను పురస్కరించుకుని శిల్పారామమంలో విభిన్నమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎఒ ఎస్.కృష్ణ ప్రసాద్ తెలిపారు. శనివారం రాష్ట్ర అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30,31, ఏప్రిల్ 1,6న మిస్సామూవీ సహకారంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 30న ఉగాది పండుగ సందర్భంగా సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు నాగాంజనేయ శర్మ చే పంచాంగ శ్రవణం ఉంటుందని తెలిపారు. 6.30 నుంచి 8.30 వరకు సాయిరా ఇంగ్లీష్ మీడియం స్కూల్, కడప వారిచే విభిన్నమైన సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. 31న ఎ.ఎం డ్యాన్స్ బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 1న ఢీ బుల్లి తెర డ్యాన్స్ మాస్టర్స్ అఖిల్, ఎస్.కె. డ్యాన్స్ మాస్టర్స్ వారిచే విభిన్నమైన సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 6న శ్రీరామనవమి సందర్భంగా స్ప్రౌట్ వ్యాలి స్కూల్ వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ప్రజలు శిల్పారామానికి వచ్చి కారక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మధుసూదన్, రామచంద్ర, వెంకటరమణ పాల్గొన్నారు.

వైవీయూ విసికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి- కడప అర్బన్ : యోగివేమన యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్‌గా నియమితులైన ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావును కడప జిల్లా టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు విసి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి పూల బుకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైవీయూలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. విద్యార్థులకు ప్రొఫెసర్లు టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మంచి భవిష్యత్తుకు నాంది పలకాలన్నారు.

చింతకుంట శివారెడ్డికి రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రదానం చేసే రాష్ట్రస్థాయి 2025 ఉగాది పురస్కారాలకుగాను సాహిత్య విభాగంలో యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సహాయ పరిశోధకులుగా పనిచేస్తున్న డాక్టర్ చింతకుంట శివారెడ్డి ఎంపిక అయ్యారు. వీరు రాయలసీమ అస్తిత్వ దిశగా పలు రచనలు చేశారు. 150కిపైగా పరిశోధన వ్యాసాలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. పలు అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో 20కి పైగా పత్ర సమర్పణలు చేశారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో ముద్రించిన 30కి పైగా పుస్తకాలకు సహసంపాదకత్వం వహించారు. పురస్కారానికి ఎంపికయిన సందర్భంగా యోగి వేమన విశ్వవిద్యాలయ బాధ్య ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాస రావు, కులసచివులు ఆచార్య పి.పద్మ, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, సిబ్బంది అభినందనందనలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి

ప్రజాశక్తి - కడప అర్బన్

కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి కృషి చేస్తామని ఆ పార్టీ నాయకులు గౌస్ పీర్ పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఎఐసిసి సమావేశం పూర్తి చేసుకుని కాంగ్రెస్ నాయకులు కడపకు చేరుకున్నారు. ఈ సందర్భంగా గౌస్ పీర్ మాట్లాడుతూ ఢిల్లీలో 16 రాష్ట్రాల సమావేశాలకు పార్టీ ఆదేశాల మేరకు వెళ్లామని తెలిపారు. అక్కడ జరిగిన సమావేశంలో ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ తోపాటు అన్ని రాష్ట్రాల నాయకులు సమావేశంలో పాల్గొన్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరూ పని చేయాలని అధిష్టానం పిలుపునిచ్చిందని చెప్పారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఒక సైనికుడిలా పనిచేస్తానని పేర్కొన్నారు.

సర్వేయర్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని ఇటుకులపాడు గ్రామ సర్వేయర్ నరసింహులను సస్పెండ్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, వ్యవసాయ మహిళా సంఘం నియోజకవర్గ అధ్యక్షులు సుబ్బలక్ష్మమ్మ, సిపిఎం మండల కార్యదర్శి పోలయ్య డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయబద్ధంగా ఉన్న రైతులకు న్యాయం చేయడంలో సర్వేయర్ పూర్తిగా విఫలమయ్యాడని ఆరోపించారు. రికార్డులో ఉన్న వారికి కాకుండా ఇతర ప్రాంతాల వారికి సహకరిస్తూ స్థానిక రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మండిపడ్డారు. అంబవరం రెవెన్యూ పొలంలో 96వ సర్వే నెంబర్‌లో కొంతమంది రైతులు సాగు చేసుకుంటూ ఆన్‌లైన్‌లో భూములు ఉండిన వారు, తమ భూములకు హద్దులు చూపాలని అర్జీలు సమర్పించారని పేర్కొన్నారు. సర్వేయర్ భూములకు కొతలు తీసి సర్టిఫికెట్ ఇవ్వకుండా ఏ సంబంధం లేని వ్యక్తికి ఇస్తున్నాడని వాపోయారు. సర్వేయర్ డబ్బులు తీసుకుని ఏ పనైనా చేస్తాడని, ఇలాంటి వ్యక్తులను సస్పెండ్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి నాయకులు కల్లూరు నాగేంద్రారెడ్డి

ఆరోపణలు అవాస్తవం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నాలుగు ఐదు రోజుల కిందట సోషల్ మీడియాలో, ప్రచార మాధ్యమాల్లో పత్రికల్లో తనపై ఆరోపణ వార్తలు వచ్చాయని, అవి వాస్తవం కాదని వైసిపి నాయకులు కల్లూరు నాగేంద్రారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక తన స్వగృహంలో ఏనుగు చెన్నకృష్ణారెడ్డి, రేగుల పాపయ్య, కుమార్తెలు వెంకటరత్నమ్మ, రామాదేవితో కలిసి విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరేళ్ల కిందట 744/1ఎ సర్వే నెంబర్ 88 సెంట్లు భూమిని, రెండు సెంట్లు దారి భూమిని మొత్తం 90 సెంట్లు ఏనుగు చెన్నారెడ్డి, రేగుల పాపయ్య వారి అనుభవం కింద ఉండే భూమిని కొనుగోలు చేశానన్నారు. తాను కొన్న తర్వాత ఆ భూమి 22-ఎ ఉందని తహశీల్దార్ ద్వారా తెలిసిందన్నారు. ప్రభుత్వం వారు 9.98 ఎకరాల భూమిని ల్యాండ్ అక్వేర్ చేశారన్నారు. పొరపాటున ఆర్ఎస్ఆర్‌లో 744/1ఎ సర్వే నెంబర్లు భూమి 10.86 ఎకరాలుగా చూపిందన్నారు. ప్రభుత్వ గెజిట్‌లో 9 ఎకరాల 98 సెంట్లుగా ఉన్న భూమి పొరపాటున పడిందన్నారు. 2022 ఏప్రిల్ 8న ఆర్‌డిఒ ద్వారా కలెక్టర్‌కు పంపారని, సరి చేయడంలో ఆలస్యం అవ్వడంతో కొంతమంది గిట్టని వారు తనపై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ఇంత భూమిని దానం చేసిన తనకు, లక్షలు వెచ్చించి కట్టుకున్న ఇల్లు ఆక్రమిత భూమిలో ఎలా కట్టుకుంటానని ప్రశ్నించారు. తనపై బురద చల్లడానికే ఆరోపణలు చేస్తున్నారని, వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు.

పోలీసు కానిస్టేబుల్ మెయిన్స్
పరీక్ష తేదీలు ప్రకటించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ప్రభుత్వం వెంటనే స్పందించి కోర్టు కేసులు క్లియర్ చేసి మెయిన్స్ పరీక్షల తేదీలను ప్రకటించాలని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ప్రొద్దుటూరులో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం 2022 నవంబర్ 28న 6100 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారని, జనవరిలో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షకు 4.52 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. ఇందులో 92 వేల మంది అర్హత సాధించారన్నారు. రెండేళ్ళ సుదీర్ఘ పోరాటం తర్వాత ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించారని, ఇప్పుడు కోర్టు కేసులు క్లియర్ చేసి మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్నా నిరుద్యోగులకు ఒరిగింది ఏమి లేదన్నారు. ఇప్పటికే పోలీస్ శాఖలో 20వేలు దాక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మరి వాటి సంగతి ఏమిటని ప్రశ్నించారు. గత మూడేళ్లుగా నిరుద్యోగులు కోచింగ్ ఫీజులు, రూం అద్దెలు కట్టలేక, పుస్తకాలు కొనలేక ఇంటిని కుటుంబాన్ని వదిలేసి చదువుకుంటుటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేటున్నారు. యువగళంలో లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తానన్న పవన్ కళ్యాణ్ అధికారంలోకి రాగానే గొంతు ముగబోయిందిన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు కోర్టు కేసులు క్లియర్ చేసి మెయిన్స్ పరీక్షల తేదీలను ప్రకటించాలని కోరారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న జాతీయ హెచ్ఆర్‌సి డాక్టర్ ప్రదీప్త కుమార్ నాయక్

సమానమైన సేవలు అందించాలి
- జాతీయ హెచ్ఆర్‌సి డాక్టర్ ప్రదీప్త కుమార్ నాయక్

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

కుష్టు వ్యాధి గ్రస్తులకు అందరితో పాటు సమానమైన సేవలు అందించాలని జాతీయ హెచ్ఆర్‌సి డాక్టర్ ప్రదీప్త కుమార్ నాయక్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ప్రత్యేక పర్యవేక్షణ అధికారి జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషనర్ డాక్టర్ ప్రదీప్త కుమార్ నాయక్ అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వ్యాధి గ్రస్తులకు సంబంధించిన సేవలు, వారి హక్కులపై సమన్వయ కమిటీ అధికారులతో చర్చించారు. వ్యాధిగ్రస్తులకు మెరుగైన సేవలు అందించడానికి వాటికి సంబంధించిన సలహాలు సూచనలు ఇచ్చారు. ప్రతి శాఖ వారు అందించే సేవలు ప్రభుత్వ పథకాలలో లేప్రోసి వ్యాధి గ్రస్తుల జాబితాను తయారు చేసుకొని వారికి వందశాతం సేవలు అందేటట్లు చూడాలని ఆదేశించారు. టిబి, ఎయిడ్స్, కుష్టు వ్యాధులు ప్రబలకుండా సరైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవ సాగర్, జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి బాబు, డిపిఎం సుబ్బారెడ్డి, ఫిజియోథెరఫీ డాక్టర్ మనోహర్, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఫిక్ పాషా, ఐసిటిసి కౌన్సిలర్ విపర్తి ప్రతాప్ కుమార్, డాక్టర్స్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - చాపాడు


ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. శనివారం నాలుగు రోడ్ల కూడలిలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదన్నారు. ఎక్కువ మందిని ఆటోలో ఎక్కించుకుంటే ప్రమాదాలకు గురవుతారని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్‌కు ఇరువైపులా ప్రయాణికులను కూర్చోబెట్టుకోరాదని తెలిపారు. ఆటో డ్రైవర్లు అధిక శబ్దంతో టేప్ రికార్డులను ఉపయోగించకూడదని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం



కడప అర్బన్ : కార్యకర్తలకు కేక్ తినిపిస్తున్న అలంకాన్‌పల్లె లక్ష్మిరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నియోజకవర్గ ఎంఎల్ఎ మాధవి ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ టిడిపి అన్నారు. ఎన్‌టిరామారావు టిడిపి స్థాపించి కాంగ్రెస్‌పార్టీ కబంద హస్తాల నుంచి తెలుగువారిని రక్షించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, నాయకులు జిలానీబాష, మన్సూర్ అలీఖాన్, జయరాం, జయకుమార్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. టిడిపి సీనియర్ నాయకులు ఆలంఖాన్ పల్లి లక్ష్మిరెడ్డి టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్‌కట్ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ స్థాపించిన అనతి కాలంలోనే అధికారాన్ని చేపట్టారని పేర్కొన్నారు. కిలో రూ.2 బియ్యాన్ని ఎన్‌టిఆర్ ప్రారంభించారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మన్మోహన్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మౌలా, గంగులయ్య పాల్గొన్నారు. **ముద్దనూరు :** టిడిపి ఆవిర్భవించి 43 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల అధ్యక్షులు చింతా శివరామిరెడ్డి, టౌన్ ఇన్‌ఛార్జి రంగారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో ఘనంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. నాయకులు ప్రసాద్ రెడ్డి, ఆది, శ్రీకాంత్ బాబు, పెద్దమాబు, అబ్దుల్ సత్తార్, బాబు, జగదీష్ నాయుడు, బాబా అమీర్, కార్యకర్తలు పాల్గొన్నారు. **దువ్వూరు :** టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల అధ్యక్షులు బోరెడ్డి రమణారెడ్డి, దువ్వూరు పట్టణ అధ్యక్షులు పాపినేని రాంబాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేశారు. అక్కడికి వచ్చిన కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు. **కడప :** తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప మహనీయుడు నందమూరి తారకరామారావు అని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, 45వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సరస్వతమ్మ అన్నారు . 45వ డివిజన్‌లో మాజి కార్పొరేటర్ సరస్వతమ్మతో కలిసి పార్టీ జండా ను ఎగురవేసి, కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలకు పంపిణీ చేసి , ఘనంగా నిర్వహించారు. **కాశినాయన :** మండలంలోని గంగనపల్లెలో మండల పార్టీ అధ్యక్షుడు బసిరెడ్డి రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులు పంచిపెట్టారు. **సింహాద్రిపురం :** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు మండలంలోని బిదినంచెర్లలో తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్ ఛైర్మన్ ,మండల పార్టీ ఇన్‌ఛార్జి మారెడ్డి జోగిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. **లింగాల :** అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం ఫలాలు అందించిన ఘనత టిడిపినే అని మండల బాధ్యుడు దేవిరెడ్డి సంజీవరెడ్డి,మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి అన్నారు స్థానిక మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో ఆవిర్భావ దినోత్సవం వేడుకలను నిర్వహించారు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు పార్టీ జండాను ఆవిష్కరించారు కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు . **వేంపల్లె :** స్థానిక టిడిపి కార్యాలయం వద్ద టిడిపి జెండాను మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి ఎగుర వేశారు. టిడిపి కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్‌లతో పాటు టిడిపి నాయకులు పాల్గొన్నారు. **చాపాడు(మైదుకూరు) :** బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యత టిడిపితోనే సాధ్యమైందని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి ప్రభంజనం సృష్టించారన్నారు. ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి బాబు, ధనపాల జగన్, ఏపి రవీంద్ర, శ్రీనువాసులు, రామచంద్రయ్య నాయుడు,ప్రబాకర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **చాపాడు :** టిడిపి ఆఫీసులో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి జెండాను ఎగరవేశారు. మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ 1982లో నందమూరి తారకరామారావు పేదల కోసం పార్టీని స్థాపిచారన్నారు. బడుగు బలహీన వర్గాలకు,పేదలకు అండగా ఉంటోందని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గురివిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వైవి సుబ్బారెడ్డి,నారపు రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఖాజీపేట:** పుల్లూరు పంచాయతీ రహమత్‌ఖాన్‌పల్లె ప్రాంగణంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** జమ్మలమడుగు నియోజక వర్గం టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి, అనంతరం ముద్దనూరు రోడ్డు నీళ్లట్యాంకు దగ్గర, సంజామల మోటు దగ్గర, నారాపురం వెంకటేశ్వర స్వామి దేవాలయం దగ్గర, కన్నెలూరులో జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రమణారెడ్డి, తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు **వేముల :** మండల కేంద్రంలో టిడిపి నాయకులు టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి ముందుగా జెండా ఆవిష్కరించి అనంతరం ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పేర్ల శేషారెడ్డి, సత్యమారెడ్డి ఓబుల్ రెడ్డి యాదవ్,శివరాం, విశ్వేశ్వర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి,వసంత కుమార్ రెడ్డి రాయబడి సుధాకర్ రెడ్డి రంగారెడ్డి గొల్లగూడు రవికుమార్ రెడ్డి, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** పేద బడుగు బలహీన వర్గాలను ఆదుకునే పార్టీ తెలుగుదేశం అని రంగసముద్రం తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు చెరుకూరి రవికుమార్ నాయుడు తెలియజేశారు. శనివారం రంగసముద్రం పంచాయతీ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ పటానికి పూలమాలలు వేసి అనంతరం జండా ఆవిష్కరించారు . కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తెలుగు తమ్ముళ్లపాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** స్థానిక పొట్టిపాడు కూడలిలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పట్టణ నందమూరి యువసేవాసమితి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నందమూరి యువసేవాసమితి అధ్యక్షులు గోమేధికమ్ సుదర్శన్, ఉపాధ్యక్షులు సిజె. వెంకట సుబ్బయ్య, కార్యదర్శులు జిఎస్.చాంద్ బాష, తాటి సుధాకర్ యాదవ్, కడప పార్లమెంటరీ మైనారిటి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి టప్పా మహబూబ్ బాష, జిల్లా తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి కూనపురి రామునాయుడు, సీనియర్ నందమూరి అభిమానులు పాల్గొన్నారు.


జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్


కడప : జెండాను ఆవిష్కరిస్తున్న వికాస్ హరికృష్ణ

ఖాళీ భవనాలు.. ఉపయోగిస్తే మేలు


నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనం

ప్రజాశక్తి -ఖాజీపేట

ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రజా అవసరార్థం నిర్మించిన భవనాలు చాలా గ్రామాలలో వృథాగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్వాడీ భవనాలు పలు గ్రామాలలో వివిధ కారణాల వల్ల నిరుపయో గంలో ఉన్నాయి. ఓవైపు ప్రభుత్వ భవనాలు పలుచోట్ల నిరుపయోగంగా ఉంటే.. మరికొన్ని ప్రాంతాలలో వేలాదిరూపాయల అద్దె చెల్లిస్తూ ప్రయివేట్ భవనాల్లో కొనసాగుతున్నాయి. స్థానిక అగ్రహారం సహకార సంఘం కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుంది. ప్రతి నెల కార్యాలయ అద్దె కింద వేలాది రూపాయలు ప్రభుత్వ సొమ్మును ఖర్చు చేస్తున్నారు. పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలోని బెస్త కాలనీలో వసతి గృహం చాలా ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. సువిశాల విస్తీర్ణంలో ఉన్న ఈ భవనాన్ని పలువురు ప్రయివేటు వ్యక్తులు ఆక్రమించుకొని సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వ భవనాలు చాలా చోట్ల వృథాగా ఉన్నా వాటిని విని యోగించుకోవాలన్నా ఆలోచన అధికారులకు కానీ, ప్రజాప్రతినిధులకు లేకపోవడం నిర్లక్ష్యానికి పరాకాష్టగా చెప్పవచ్చని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రభుత్వ భవనాలను వృథాగా వదిలేసి ప్రజాధనాన్ని అద్దెల రూపంలో ఖర్చు చేయడం అధికారులకు తగునా అని ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భవనాలను ప్రయివేటు వ్యక్తులు దర్జాగా అనుభవిస్తుంటే అధికారులు చూసి చూడనట్లు వదిలేయటం సరి కాదని, ప్రజల ఆస్తులను రక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఊరుకుండిపోవడం తగదని పలువురు హెచ్చరిస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను రైతుల అవసరాల నిమిత్తం గోడౌన్లుగా ఉపయోగించినా ప్రయోజనకరంగా ఉంటుందని కొందరి రైతులు తమ అభిప్రాయాలు వ్యక్తపరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయాచోట్ల నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించి ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా చర్యలు చేపడితే ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటున్నారు.



మాట్లాడుతున్న శివకుమార్

సిసి కెమెరాలు అమర్చాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రైల్వేస్టేషన్ ఆవరణంలో సిసి కెమెరాలు అమర్చాలని, ప్రయాణికుల వాహనాలకు భద్రత చర్యలు చేపట్టాలని డివైఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శనివారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జమ్మలమడుగు చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి విజయవాడ, కడప, ధర్మవరం వంటి ప్రాంతాలకు ఎక్కువ మంది ప్రయాణాలు చేస్తున్నారన్నారు. రైలు సమయం కూడా ఉదయం, రాత్రి సమయాలలో ఉందన్నారు. ప్రజలు ఎక్కువగా ఉద్యోగస్తులు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు కడపకు ఎక్కువగా వెళ్లి వస్తుంటారన్నారు. అటువంటి సందర్భంలో ద్విచక్ర వాహనాలు రైల్వే స్టేషన్ ఆవరణంలో పార్కింగ్ చేసి వెళుతుంటారన్నారు. గత కొన్ని రోజుల కిందట రైల్వే స్టేషన్లో ద్విచక్ర వాహనాలు దొంగతనాలు కూడా జరిగిన సంఘటనలు ఉన్నాయన్నారు. ప్రయాణికుల భద్రతకు సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షులు సుబహాన్ పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - ముద్దనూరు : స్థానిక గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయం వద్ద జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఆదిశేషారెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి రామలింగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బహిరంగ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలు చేసిన పనులు జరిగిన చెల్లింపులపై ప్రజా వేదిక నిర్వహించారు. కూలీలు చెరువుల్లో మట్టి తవ్వకాలు, ఇంకుడు గుంతలు, పంచాయతీరాజ్ ద్వారా చేసిన సచివాలయ భవనాలు, సిసి రోడ్లు, గృహనిర్మాణశాఖలో 90 రోజుల పని దినాలు, చెట్లు, మొక్కల పెంపకం మొదలైన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించారు. 19 గ్రామ పంచాయతీల్లో గుర్తించిన పనులు, చెల్లింపులను ప్రజా వేదికలో తెలియజేశారు. రూ. 26,178 రికవరీ చేసినట్లు పీడీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ముకుందరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ మధుసూదన్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్ పి.కాంతయ్య, ఎపిఒ గంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ అధికారులు

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాష్ట్రం లో పదో తరగతి పరీక్షలు ఇంకా పూర్తి కాకముందే ప్రొద్దుటూరు పట్టణం లోని ప్రయివేట్, కార్పొట్ విద్యాసంస్థలు ముంద స్తు బహిరంగ అడ్మిషన్లు నిర్వహి స్తున్నారని, వెంటనే విద్యాశాఖ అధికారులు వారిపై చర్యలు తీసు కోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహుల్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కడప జిల్లాలో అనేక ప్రాంతాల్లో విద్యా విధానాలను, విద్యా హక్కుల చట్టాలను అతిక్రమిస్తూ అడ్మిషన్ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇంకా పదో తరగతి పరీక్షలు పూర్తికాక ముందే ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగా ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. పబ్లిక్‌గా కరపత్రం వేస్తూ ప్రచారం చేస్తూ విద్యావిధానం కాలరాసే విధంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. వీటి పైన విద్యాశాఖ అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం చాలా దారుణమన్నారు. వారి పైన జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీహరి,ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థి దశలో క్రమశిక్షణ ముఖ్యం

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు : విద్యార్థి దశలో క్రమశిక్షణ శ్రద్ధ ఎంతో అవసరమని శివ దర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు స్వామిని శివ దర్శనానంద సరస్వతి మాతాజీ అన్నారు. ట్రస్ట్ వార్షికోత్సవంతో పాటు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహి ంచారు. గెలుపొందిన విజేతలకు శనివారం బహుమతి ప్రదానం చేశారు. నాలుగు అంశాలలో పోటీలు నిర్వహించారు. ఉగాది షడ్రుచులపై వ్యాసరచన పోటీలు,నేటి సమాజంలో సంస్కృతి-సాంప్రదాయాలు అన్న అంశంపై పోటీలు, బాలురకు కబడ్డీ, బాలికలకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాతాజీ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులను గురువులను గౌరవించాలన్నారు. దేశభక్తి కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గోపీనాథ్ రెడ్డి ,పల్లేటి ప్రభాకర్ రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-చెన్నూరు : మండలంలోని చిన్నమాచుపల్లి జిలా పరిషత్, రావమనపల్లె జిల్లా పరిషత్ పాఠశాలల్లో 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి గరికపాటి దీనబాబు ఆధ్వర్యంలో శనివారం పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో చట్టం అంటే లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం, 2012, ఇది పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పిస్తాయని పేర్కొన్నారు. లైంగిక వేదింపులకు పాల్పడితే కఠినమైన శిక్షలు, తీవ్రమైన లైంగిక వేధింపుల కేసుల్లో మరణశిక్ష, జరిమానాలు జైలుశిక్ష విధిస్తారని చెప్పారు. 18 ఏళ్ల లోపు పిల్లలందరికీ రక్షణ కల్పిస్తుందని తెలిపారు.


వంట నిర్వాహకులతో మాట్లాడుతున్న ముకుందరెడ్డి

మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వం సచివాలయాల ద్వారా పలు సేవలను సిబ్బంది ప్రజలతో సమన్వయం పాటించి మరింత మెరుగ్గా అందించాలని ఎంపిడిఒ ముకుందరెడ్డి సూచించారు. దేనేపల్లె, చింతకుంట గ్రామ పంచాయతీల్లోని చెత్త సంపద తయారీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలు, అంగన్వాడీ కేంద్రాలు, పారిశు ధ్యం పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పారిశు ధ్యం లోపించకుండా గ్రామాలను శుభ్రంగా ఉంచాలన్నారు. రోజూ చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులు,పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. సచివాలయం సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కత్తెమ్ శ్రీనివాసులు, ఎంపిటిసి వెంకట సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారులతో పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు
ఉగాది, రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు ఉగాది, రంజాన్ పండుగ వేడుకలను విద్యార్థులతో కలిసి పాఠశాల యాజమాన్యం శనివారం నిర్వహించారు. విద్యార్థులకు అకడమిక్ ఎక్స లైన్స్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థి పండుగ విషయాలు తెలుసుకోవాలనే ఉద్దేశంతో ముందస్తు వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి పండుగకు ఒక విశేషం అనేది ఉంటుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను పెంచడమే కాకుండా సంప్రదాయాలపై అవగాహన పెంచు తాయని చెప్పారు. అనంతరం పండుగల గొప్పదనంపై విద్యార్థులు వారి వారి భాషల్లో ప్రసంగాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడంతో విద్యార్థులు సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చేతన్ రెడ్డి, శ్రీచైతన్యరెడ్డి,విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరలో బుడగ జంగాలకు ఎస్‌సి సర్టిఫికెట్లు

ప్రజాశక్తి - కడప : త్వరలో బుడగ జంగాలకు ఎస్‌సి సర్టిఫికెట్లు ఇచ్చేందుకు కృషి చేస్తామని కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి అన్నారు. కడప నగరం బేడ బుడగజంగం కాలనీకి చెందిన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దూపం రాజు, ఉపాధ్యక్షులు డి.శ్రీరాములు ఆధ్వర్యంలో ఎస్‌సి వర్గీకరణలో తమ కులాన్ని చేర్చి క్యాబినెట్ లో ఆమోదించి కేంద్రానికి పంపినందుకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.కొండయ్య స్థానిక నాయకులు, విద్యార్థులు కలిసి శనివారం ఎమ్మెల్యేను, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డిని శాలువతో ఘనంగా సన్మానించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శివరెడ్డి, సంక్షేమ సంఘం ప్రతినిధులు జి.కళ్యాణ్, పి. సురేష్, డి.వెంకట్, కె. వెంకటఃరమణ, డి.మల్లికార్జున పాల్గొన్నారు.